క్లుప్తంగా

పోడు భూములకు పట్టాలివ్వాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

భీమిని: పోడు భూములకు పట్టాలివ్వాలని మండలంలోని ఖర్జీభీంపూర్ రైతులు తహసీల్దార్ భీకర్ణదాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఖర్జీభీంపూర్ గ్రామ పరిధిలోని 312 సర్వే నంబర్‌లో గత 40సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నామని వాటికి పట్టాలివ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ జిల్లా కమిటీ సభ్యుడు బాపురావు, సుగుణ, మొండక్క, సురేష్, పార్వతి, రమేష్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఐచర్ ట్రాక్టర్ నూతన ఆవిష్కరణ



ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని ఐచర్ ట్రాక్టర్ షోరూం రాజరాజేశ్వర ఏజెన్సీస్‌లో నూతన ఐచర్ ట్రాక్టర్ 480 ఫోర్ వీల్ డ్రైవ్ ప్రైమా జీ3 మోడల్‌ను మంగళవారం ఐచర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సతీష్ మాచి రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక రైతుల అవసరాలకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులను సులభతరం చేయడానికి ఈ నూతన ఐచర్ ట్రాక్టర్ 480 ఫోర్ వీల్ డ్రైవ్ ప్రైమా జీ3ని ఆవిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్ఎం ఏ. రాము, స్థానిక రాజరాజేశ్వర ఏజెన్సీస్ ప్రొప్రైటర్ పుల్లారావు, స్థానిక రైతులు, ఫైనాన్సియర్స్, రాజరాజేశ్వర ఏజెన్సీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'సర్టిఫికెట్లు ఇవ్వాలనే నిర్ణయం హర్షణీయం'

బెల్లంపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని తెలంగాణ అనుభవ వైద్యుల సంఘం మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల రవి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతులు, ప్రత్యేకించి సర్టిఫికెట్ల జారీ కోసం ఎన్నో ఏళ్ల నుంచి ఆర్ఎంపీ, పీఎంపీలు ఎదురు చూస్తున్నామని తెలి పారు. గతంలో కొంతమందికి శిక్షణ తరగతులు నిర్వహించినప్పటికీ, వారికి సర్టిఫికెట్లు జారీ చేయలేదని పేర్కొన్నారు. మారుమూల గ్రామీణప్రాంతాల ప్రజలకు అత్యవసర ప్రాథమిక వైద్య సేవలు అందించడానికి, అనుభవ వైద్యులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వీరికి శిక్షణ తరగతులు నిర్వహించి, సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సర్టిఫికెట్లు ఇవ్వడం వల్ల ఆర్ఎంపీ, పీ ఎంపీలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలి పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి సానుకూల ప్రకటన చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను హర్షిస్తూ మండల కేంద్రాలు, గ్రామాలల్లో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేయాలని ఆర్ఎంపీ, పీఎంపీలకు పిలుపునిచ్చారు.

కన్నెపల్లిలో భారీ వర్షం



కూలిన ఇంటి వద్ద అంబాల పోచయ్య

భీమిని: కన్నెపల్లి మండలంలో మంగళవారం భారీ వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా కన్నెపల్లిలో వర్షాలు అనుకూలంగా కురవకపోవడంతో రైతులు పత్తి గింజలను వేసి మొలకలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంత మంది రైతులు రెండోసారి పత్తి గింజలను నాటారు. దీంతో మంగళవారం కురిసిన వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు.

కూలిన ఇల్లు

కోటపల్లి: మండలంలోని వెంచపల్లి గ్రామానికి చెందిన అంబాల పోచయ్య ఇల్లు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూలి పూర్తిగా నేలమట్టం అయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇల్లు పూర్తిగా నేలమట్టం అవడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. తన ఇల్లు పూర్తిగా నేలమట్టం కావడంతో తమను ప్రభుత్వం ఆదుకోవాలని పోచయ్య వేడుకున్నాడు.

అధికారుల తప్పిదం.. రైతుకు శాపం

- ఫిష్ పాండ్ నిర్మాణంలో ఎన్ఆర్ ఈజీఎస్ అధికారుల నిర్వాహకం
- చెరువు శిఖంకు బదులు పట్టా భూమిలో పనులు
- రైతు ఆవేదన పట్టించుకోని అధికారులు



పట్టా భూమిలో తవ్విన ఫిష్ పాండ్

తాండూర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది అవగాహన రాహిత్యం, నిర్లక్ష్యపు పనితీరు తో 'ఉపాధి' నిధులు వృథా అయిన సంఘటనా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన తాండూర్ మండలం కాసిపేట గ్రామ పంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారుల నిర్లక్ష్య వైఖరితో ఓ రైతు ఇక పై ఏటా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కాసిపేట గ్రామ పంచాయతీ పరిధి రంగసముద్రం చెరువు శిఖం భూమిలో సుమారు రూ.9లక్షల వ్యయంతో ఫిష్ పాండ్ పనులు చేపట్టడానికి ఈజీఎస్ అధికారులు ప్రతిపాదించారు. ఇందుకు సంబంధించిన నిధులు కూడా మంజూరయ్యాయి. అందుకు అనుగుణంగా ఫిష్ పాండ్ పనులు కూడా చేపట్టారు. దాదాపు పనులు తుది దశకు చేరుకున్నాక గానీ, జరిగిన తప్పిదాన్ని ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది గుర్తించలేకపోయారు.

చేతులెత్తేస్తున్న అధికారులు...

ఫిష్ పాండ్ నిర్మాణ విషయాన్ని ఉపాధి హామీ పథకం, ఇరిగేషన్ అధికారులు ఎవరికీ వారుగా చేతులెత్తేస్తున్నారు. ఆ తప్పిదం తమది కాదని తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు చూపించిన స్థలంలోనే ఫిష్ పాండ్ నిర్మాణం పనులు చేశామని ఈజీఎస్ అధికారులు చెబుతుండగా, అసలు ఫిష్ పాండ్ నిర్మాణ విషయంలో తమను ఏమాత్రం సంప్రదించలేదని ఆ నిర్మాణ పనులు తమ పరిధిలోకి రావని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు. ఇలా ఒకరి పై ఒకరు నెపాన్ని నెట్టుకుంటున్నారు. తప్పు ఎవరిదైనా బాధ అనుభవిస్తున్నది మాత్రం రైతు. అంతేకాక ఉపాధిహామీ నిధులు కూడా వృథా అయ్యాయి. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఏం జరిగిందంటే...

రంగ సముద్రం చెరువు శిఖం భూమిలో ఫిష్‌పాండ్ నిర్మాణం పనులు చేపట్టాల్సి ఉండగా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి తప్పిదానికి పాల్పడ్డారు. భీమ సరోజన అనే మహిళ పట్టేదారు భూమి సర్వే నంబర్ 11లో ఫిష్ పాండ్ నిర్మాణం పనులు చేపట్టారు. పని చేసిన కూలీలకు రూ.1.80లక్షల బిల్లు కూడా చెల్లించారు. దరఖాస్తు చేయకపోయినా తమ పట్టా భూమిలో ఫిష్ పాండ్ నిర్మాణ పనులు చేపట్టడంతో బాధితురాలు తమ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సర్వేయర్‌ను పిలిపించి భూమి కొలతలు చేయించారు. ఫిష్ పాండ్ తవ్విస్తున్న భూమి చెరువు శిఖం భూమి కాదని అధికారికరంగా వెల్లడైంది. ఫిష్ పాండ్ నిర్మాణం చేసిన స్థలం ముమ్మాటికీ సరోజన పట్టా భూమి అని అధికారులు ధ్రువీకరించనట్లు సమాచారం. ఆ తరువాత జరిగిన తప్పిదాన్ని సరిచేసుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టినట్లు చేశారు. తవ్విన గుంతలను పూడ్చివేస్తామని పట్టాదారు కు హామీ ఇచ్చి నెలలు గడిచినా, పట్టింపు చేయకపోవడంతో బాధిత మహిళ తీవ్ర ఆవేదను గురవుతున్నారు. నెలల తరబడి కార్యాలయం చు ట్టూ తిప్పించుకుంటు న్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా బాధితురాలు తనకు జరిగిన అన్యాయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

ఫిష్‌పాండ్ నిర్మాణ విషయంలో తప్పు దొర్లినట్లు నా దృష్టికి వచ్చింది. ఈ విషయం పై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యుల పై చర్యలు తీసుకుంటా. రైతుకు తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తాం. నిధుల దుర్వినియోగం జరిగినట్లు తెలిస్తే అందుకు కారణమైన అధికారులు, సిబ్బంది నుంచి రికవరీ చేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– శ్రీనివాస్, ఎంపీడీవో, తాండూర్

అంధకారంలో రాపన్‌పల్లి ఎస్సీ కాలనీ

- పట్టించుకోని అధికారులు



సెల్‌ఫోన్ వెలుగులో రాపనపల్లి కాలనీవాసులు

కోటపల్లి: మండలంలోని రాపన్‌పల్లి ఎస్సీ కాలనీవాసులు వారం రోజులుగా అంధకారంలో ఉంటూ రాత్రిపూట తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకి విద్యుత్ సరఫరా అయ్యే 55కే.వి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో లోపాలతో కాలనీకి విద్యుత్ సరఫరా కావడంలేదని కాలనీవాసులు 15రోజుల క్రితమే లైన్‌మెన్, ఏఈ, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో తాము చీకట్లోనే ఉండాల్సి వస్తుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే మహారాష్ట్ర తెలంగాణ సరిహద్దు గ్రామం కావడం, వర్షాకాలం విషపురుగులతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎప్పుడు తెల్లవారుతుందోనని చూడాల్సి వస్తుందని కాలనీవాసులు తెలిపారు. దళితవాడల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని కాలనీవాసులు పలువురు ఫిర్యాదు చేసినా, దళితులమనే అధికారులు తమను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఇదే విషయంపై లైన్‌మెన్ సత్యనారాయణను వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ లెవల్స్ లేక విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పై అవగాహన ర్యాలీ



చెన్నూర్ 18వ వార్డులో అవగాహన ర్యాలీ

చెన్నూర్: మున్సిపాలిటిలోని 17, 18వార్డుల్లో మంగళవారం మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, మెడికల్, మెప్మా, ఆశ వర్కర్లు, సిబ్బంది సీజనల్ వ్యాధుల పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వార్డులలోని ప్రజలకు వర్షాకాలం దోమలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలను ప్రజలకు వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు ధరిచేరవని కమిషనర్ అన్నారు. అనంతరం వార్డులలో బ్లీచింగ్ పౌడర్, బైటెక్ ద్రవణాన్ని స్ప్రే చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాయిని శ్యామల, గర్రెపల్లి శాంతరాణి, కమ్మల శ్రీనివాస్, కమిషనర్ గంగాధర్, ఇన్‌చార్జి శానటరీ ఇన్స్‌పెక్టర్ రాజ్‌కుమార్, మెప్మా, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

వేమనపల్లి: వర్షాకాలంలో డెంగీ జ్వరాలు విజృంభిస్తాయని ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని వైద్యాధికారి రాజేష్ సూచించారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీలో డెంగీ మాస ఉత్సవాలను పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారి రాజారెడ్డి, సూపర్‌వైజర్ అపరంజి, స్టాఫ్ నర్స్ శ్రీవాణి, హెల్త్ అసిస్టెంట్‌లు బాపు, లింగయ్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఉమాదేవి

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి సీఎస్ఐ పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ ఉమాదేవి మాట్లాడుతూ.. నూతన విద్యావిధానంలో చిన్నారులకు విద్యా బోధన అందించాలన్నారు. నిర్బంధ విద్యలా కాకుండా ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా బోధన చేయాల్సి ఉంటుందన్నారు. బోధన ద్వారా చిన్నారులు రోజువారీగా అంగన్‌వాడీకి ఇష్టపూర్వకంగా హాజరయ్యేలా చూడాలన్నారు. నూతన విద్యా విధానాన్ని అంగన్‌వాడీలు ఆకలింపు చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యాబోధన పుస్తకాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మమత, స్వరూపారాణి, సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గోరింటాకు సంబురం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని కమ్మసేవా సమితి కార్యాలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కమ్మసేవా సమితి మహిళా సభ్యులు మంగళవారం గోరింటాకు సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కమ్మసేవా సమితి మహిళలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'వనమహోత్సవం'



ఆర్కేపీలో మొక్క నాటుతున్న చైర్‌పర్సన్, కమిషనర్



చెన్నూర్: బుద్ధారం రోడ్డులో వనమహోత్సవం



బెల్లంపల్లి: మొక్కలతో చైర్‌పర్సన్, కౌన్సిలర్

చెన్నూర్: మొక్కలతోనే మానవ మనుగడ ఉంటుందని, వనాలు అంతరించిపోతే మానవ మనుగడకే ప్రమాదం వాటిల్లుందని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం వన మహోత్సవం నిర్వహించారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్, బుద్ధారం రోడ్డులో కమిషనర్‌తో పాటు పాలకవర్గ సభ్యులు మొక్కలు నాటారు.

రామకృష్ణాపూర్: వనమహోత్సం కార్యక్రమంలో భాగంగా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కుర్మపల్లిలో రోడ్డుకిరువైపులా మొక్కలు నాటారు. మొక్కలు నాటటమే కాకుండా బాధ్యతగా వాటిని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ 1వ వార్డు కన్నాల బస్తీలో ఇంటింటా మొక్కలు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, ఒకటో వార్డు కౌన్సిలర్ సూరం సంగీత, పర్యావరణ ఇంజనీర్ సంతోష్ వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మహిళలకు మొక్కలు అందించారు. కార్యక్రమంలో టీఎంసీ దుర్గయ్య, వార్డు మహిళలు, సభ్యులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మంగళవారం మున్సిపల్ అధికారులు వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు వార్డులోని ప్రజలకు వివిధ రకాల మొక్కలు పంపిణీ చేశారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న కమిషనర్

సీసీ కెమెరాలపై అవగాహన

దండేపల్లి: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకం అని దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల వ్యాపారులు, ముఖ్యులతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీసీకెమెరాల ఏర్పాటుపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలు, బస్టాప్‌లు, ప్రధాన కూడళ్ల వద్ద, వ్యాపారులు దుకాణాల ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

సందడిగా పీరీల ఊరేగింపు



భీమారం: పీరీల వద్ద పూజలు చేస్తున్న నాయకులు



జన్నారం: పీరీల ఊరేగింపులో భక్తులు

జన్నారం/కాసిపేట/భీమారం: మొహర్రంను పురస్కరించుకొని పీరీలను ఊరూరా ఊరేగిస్తున్నారు. గుండాలు తవ్వి చుట్టూ నృత్యం చేస్తున్నారు. జన్నారం, భీమారం, కాసిపేట మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఇంటింటికి ఊరేగిస్తుండగా పీరీలకు కుడుకలు వేసి పూజలు చేస్తున్నారు. నేడు ఆఖరు రోజు కావడంతో పీరీల ఊరేగింపు చేపట్టగా బుధవారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. అదేరోజు సాయంత్రం పీరీలను నిమజ్జనం చేయనున్నారు.



మందమర్రిరూరల్: ర్యాలీలో ఎంపీడీవో రాజేశ్వర్



కాసిపేట: ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్



జిల్లా కేంద్రంలోని అర్కలవాడ 2 కేంద్రంలో...

ఊరూరా అంగన్‌వాడీ బాట

భీమారం/భీమిని/మందమర్రిరూరల్/జన్నారం/కాసిపేట/చెన్నూర్‌రూరల్/మంచిర్యాలటౌన్: అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం మంగళవారం జిల్లా వ్యా ప్తంగా కొనసాగింది, జిల్లా కేంద్రంలోని అర్కలవాడ 2 కేంద్రం టీచర్ సురేఖ, ఆయా గౌరీల ఆధ్వర్యంలో చిన్నారులు, వారి తల్లి దండ్రులతో వార్డులో ర్యాలీని నిర్వహించి, చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని కోరా రు. కాసిపేట మండలంలోని చింతగూడం, మందమర్రి మండలంలోని ఆదిల్ పేట్‌లో, చెన్నూర్ మండలంలోని సుబ్బరాంపల్లిలో, జ న్నారం మండలం తిమ్మాపూర్, కలమడుగు గ్రామాల్లో, భీమారం మండలంలోని దాంపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. భీమిని, క న్నెపల్లి మండలాల్లో ఐసీడీఎస్ అంగన్‌వాడీ సిబ్బంది చిన్నారులతో గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో రెండున్నర సంవత్సరాల నుంచి 5సంవత్సరాల వయస్సు కలిగిన పిలలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఊరూరా ర్యాలీలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో పాటు విద్యాబోధన, పౌష్టికాహారం అందుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో కాసిపేటలో సూపర్‌వైజర్ రాధిక, అంగన్‌వాడీ టీచర్లు పల్లవి, విజయ, మందమర్రిలో ఎంపీడీవో రాజేశ్వర్, మహిళా సాధికారిక హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్యారాణి, అంగన్వాడీ టీచర్ నాగరాణి, భీమినిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరా, రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు సునీత, వేరోణిక, వెంకటలక్ష్మి, సరి త, జన్నారంలో అంగన్‌వాడీ టీచర్లు జాడి సంజీవరాణి, జమున, కలమడుగు అంగన్‌వాడీ టీచర్లు రా ణి, విజయలక్ష్మి, కార్యదర్శి లావణ్య, భీమారంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు లక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్‌లో ర్యాలీ తీస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



దాంపూర్‌లో అంగన్‌వాడీ బాట ర్యాలీ



జన్మాపూర్‌లో చిన్నారులతో ర్యాలీ

'పట్టాదారుల వివరాలు ఉన్నతాధికారులకు నివేదిస్తాం'



గ్రామసభలో పాల్గొన్న తహసీల్దార్ భోజన్న

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి శివారు సర్వే 5/79, 80, 81లకు సంబంధించిన పట్టాదారుల కాస్తు వివరాలు ఉన్నతాధికారుకు నివేదిస్తామని తహసీల్దార్ భోజన్న తెలిపారు. మండలంలోని పెద్దనపల్లి గ్రామపంచాయతీ కార్యాయలంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి ఓపెన్‌కాస్ట్‌కు సంబంధించి 27ఎకరాల భూమి అవసరం కాగా, ఈ సర్వే నంబర్లలో రైతుల వివరాలు తెలుసుకునేందుకు గ్రామ సభ నిర్వహించినట్లు తెలిపారు. పట్టాదారులు ప్రస్తుతం కబ్జాలోని వివరాలు తెలియజేయాలని అనంతరం భూమి వద్దకు వెళ్లి పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామని తెలిపారు. మండల సర్వేయర్ రాజశేఖర్‌చారి, ఆర్ఐ స్వేత, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గురుపూజోత్సవం

దండేపల్లి: మండలంలోని కొండాపూర్‌లో వివేకానంద సేవా సంస్థ గ్రంథాలయం వద్ద మంగళవారం గురుపూజ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖులను సన్మానించారు. అనంతరం గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు.